నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, శుక్రవారం 31 జనవరి 2025 | HYDERABAD

అపార్ నమోదులో గందరగోళం

సిటీబ్యూరో, జనవరి 30 (నమస్తే తెలంగాణ) : ఒకే దేశం ఒకే ఐడీలో భాగంగా ప్రతీ విద్యార్థికి అపార్ (ఆటోమేటెడ్ పర్మనెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రి) ఐడీ నమోదు చేసే ప్రక్రియను విద్యాశాఖ వేగవంతం చేయడానికి సిద్ధమైంది. అయితే అపార్ ఐడీ నమోదుకు క్షేత్రస్థాయిలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని టీచర్లు చెబుతున్నారు. విద్యార్థుల పేర్లు ఆధార్‌లో ఒకలా.. స్కూల్ రిజిస్టర్‌లో మరోల ఉండటం వల్ల ఆ పేర్లను ఎలా ఎంటర్ చేయాలనే దానిపై గందరగోళ పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. ఇందుకోసం విద్యార్థి పేరు ఏ విధంగా ఎంటర్ చెయ్యాలో చెప్పాలని కోరుతూ తల్లిదండ్రుల నుంచి అంగీకార పత్రం కోరుతున్నారు. దీంతో పాటు ఆ పేరుకు సంబంధించిన గుర్తింపు కార్డును కూడా జత చేయాలని స్కూళ్ల నిర్వాహకులు చెప్పడంతో తల్లిదండ్రులు ఆధార్ కార్డులో పేరు మార్పుల కోసం సమయం పడుతుందని సమాధానమిస్తున్నారు. ఈ క్రమంలో అపార్ నమోద ప్రక్రియకు గడువు పొడిగించాలని స్కూళ్ల నిర్వాహకులు విద్యాశాఖను కోరాయి. ఇటీవల జనవరి 31 వరకు హైదరాబాద్‌లో అపార్ ఐడీ నమోదు గడువుగా పెట్టారు. కానీ ఇప్పుడు ఆ సమయం మరింత పొడిగించాలని డిమాండ్లు వ్యక్తమయ్యాయి.

1912కు కాల్ చేయండి

సిటీబ్యూరో, జనవరి 30 (నమస్తే తెలంగాణ): వినియోగదారులకు మరింత మెరుగైన సేవలందించే ఉద్దేశంతో గ్రేటర్ హైదరాబాద్ నగరానికే పరిమితమైన టోల్ ఫ్రీ నంబర్ 1912ను గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరిస్తున్నామని టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం గానీ, ఏదైనా విద్యుత్ అత్యవసర పరిస్థితి కానీ ఎదురైనప్పుడు ఈ నంబర్‌లో సంప్రదించాలని వినియోగదారులకు ఆయన సూచించారు. మునుపెన్నడూ లేనంతగా ఈ జనవరి నెలలో దక్షిణ డిస్కంలో విద్యుత్ డిమాండ్ 9500 మెగావాట్లకు చేరిందని, ఒక్క గ్రేటర్‌లోనే 4800 మెగావాట్లకు చేరడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వేసవి కాలంలో ఈ డిమాండ్ విపరీతంగా పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో పనులు చేపట్టామని, సిబ్బంది కూడా వినియోగదారుల సమస్యలపై సకాలంలో స్పందించి వాటికి పరిష్కారం చూపాలని ముషారఫ్ ఫరూఖీ తెలిపారు.

గురువారం రాత్రి సచివాలయం ఎదుట ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రయాణికులు ఇబ్బందులుపడ్డారు.

రియల్ విషాదం

కొన్ని నెలలుగా రియల్ ఎస్టేట్ రంగాన్ని ఆవహించిన స్తబ్ధత

గణనీయంగా పడిపోయిన నిర్మాణాల క్రయ విక్రయాలు

కోట్లు కుమ్మరించి.. దిక్కుతోచని స్థితిలో రియల్ వ్యాపారులు

గుదిబండగా మారుతున్న ప్రైవేటు అప్పులు, బ్యాంకు రుణాలు

ఆందోళన కలిగిస్తున్న బిల్డర్ వేణుగోపాల్‌రెడ్డి ఆత్మహత్య ఉదంతం

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి/కుత్బుల్లాపూర్, జనవరి 30 (నమస్తే తెలంగాణ):

గత ఏడాది కాలంగా హైదరాబాద్ మహానగరంలోని రియల్ రంగాన్ని స్తబ్దత ఆవహించిందనేది బహిరంగ రహస్యం. బయటికి దేశంలోనే ఈ స్తబ్ధత ఉందనే ప్రకటనలు వస్తున్నా... పాలకుల నిర్ణయాల పర్యవసానం కూడా రియల్ రంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపిందనేది అక్షర సత్యం. అప్పులు తీర్చలేకనే తనువు చాలిస్తున్నాను అంటూ కొంపల్లికి చెందిన వేణుగోపాల్‌రెడ్డి బలవన్మరణానికి పాల్పడిన తాజా విషాద సంఘటన ఆందోళనకు గురి చేస్తున్నది. హైదరాబాద్ అనేది రియల్ రంగానికి స్వర్గదామం అని గతంలో ఎన్నో సర్వేలు రుజువు చేశాయి. అంతేకాదు... అత్యంత సురక్షిత, ప్రశాంతమైన ప్రపంచ నగరాల్లో హైదరాబాద్‌కు కూడా సముచిత స్థానం ఉండటంతో జాతీయ, అంతర్జాతీయ రియల్, నిర్మాణ రంగ ప్రాజెక్టులు ఇక్కడికి వచ్చేందుకు పోటీపడ్డాయి. కానీ ఇదంతా 'గతమెంతో ఘనం'గా మారిపోయింది. గత ఏడాది కాలంగా హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల్లో రియల్, నిర్మాణ రంగంలో మునుపెన్నడూలేని స్తబ్దత నెలకొందని అనేక సర్వేలు వెల్లడిస్తున్నాయి. దీనితో పాటు ప్రభుత్వపరంగా వచ్చే స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయంలోనూ గతంతో పోలిస్తే గణనీయమైన తగ్గుదల నమోదవుతుంది. ఇక... జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏకు నిర్మాణాలపరంగా వచ్చే ఆదాయాల్లోనూ భారీ తగ్గుదల కనిపిస్తున్నది. అయితే మళ్లీ రియల్ రంగం పుంజుకోకపోదా! అని ఆశగా ఎదురు చూడటం వరకు బాగానే ఉంది. కానీ గతంలో మొదలై ఇప్పుడు విక్రయాల దశలో ఉన్న నిర్మాణ ప్రాజెక్టులకు ఈ పరిణామం దినదిన గండంలా మారింది. చేతిలో ఉన్న కోట్లాది రూపాయలతో పాటు అందినకాడికి ప్రైవేటు అప్పులు, అవసరమైనకాడికి బ్యాంకు రుణాలు తెచ్చి చేపట్టిన ఈ ప్రాజెక్టులపై వడ్డీ భారం నానాటికీ గుదిబండలా మారుతున్నది. దీనికి తోడు విక్రయాలు జరగకపోవడంతో మార్కెట్లోనూ నైరాశ్యం నిండుకుంటున్నదని రియల్ నిపుణులే వాపోతున్నారు. గత ఏడాది కాలంగా రియల్, నిర్మాణ రంగంలో స్తబ్దత నెలకొనగా... దీనికి తోడు పాలకులు తీసుకున్న నిర్ణయాలు మూలిగే నక్కపై తాటిపండులా మారాయి. ముఖ్యంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకువచ్చిన హైడ్రా కారణంగా సామాన్యుడు హైదరాబాద్, చుట్టుపక్కల ఎక్కడైనా ఫ్లాటు కొనాలన్నా జంకుతున్నారనేది క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవం. ఆ నిర్మాణం చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌లో ఉందా? దాని వెనక ప్రభుత్వ, ఇతరత్రా స్థలాల లింకుల ఏమైనా ఉందా? ఇప్పుడు అన్ని అనుమతులు చూపెడుతున్నా... రేప్పొద్దున అవన్నీ అక్రమమని తేలిస్తే మన పరిస్థితి ఏమిటి? అందుకు అనేక ప్రత్యక్ష ఉదాహరణలు కూడా ఉన్నాయి కదా... ఇవీ సామాన్యుడి ఆలోచన తీరు. ఇదే నిర్మాణ ప్రాజెక్టుల విక్రయాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని ఓ రియల్టర్ తెలిపారు. ప్రభుత్వ పెద్దలు, అధికారులు తరచూ ఫీల్ గుడ్ అన్నట్లుగా అంతా బాగుందని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని అంటున్నారు.

ఒక్కొక్క మెట్టు ఎక్కుదామని...

రెండ్రోజుల కిందట ఆత్మహత్య చేసుకున్న బల్డర్ వేణుగోపాల్‌రెడ్డి దాదాపు ఎనిమిది ఏండ్లుగా రియల్-నిర్మాణ రంగంలో ఉన్నారు. తన మిత్రులతో కలిసి పలు నిర్మాణ ప్రాజెక్టులను పూర్తి చేశారు. అవి విజయవంతంగా పూర్తవ్వడంతో తద్వారా వచ్చిన వ్యాపార, ఆర్థిక ప్రోత్సాహంతో సొంతంగా రియల్ రంగంలో నిలదొక్కుకునేందుకు మొదటి అడుగు వేశారు. తన కుమార్తె ఆద్య పేరిట గుండ్ల పోచంపల్లిలో అపార్టుమెంటు నిర్మాణాన్ని మొదలుపెట్టారు. గుండ్ల పోచంపల్లిలోని ఏజీ కాలనీలో 480 చదరపు గజాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఈ అపార్టుమెంటులో పది ఫ్లాట్లు అంటే ఒక్కో ఫ్లాటు విస్తీర్ణం కనీసంగా రెండువేల చదరపు అడుగుల పైమాటే. అక్కడ చదరపు అడుగు రూ.5500-6వేల వరకు నడుస్తున్నది వ్యాపారులు చెబుతున్నారు. ఆ ప్రాజెక్టు టర్నోవర్ పది కోట్లకు పైగా ఉంటుందని తెలుస్తున్నది. కోట్లాది రూపాయల వ్యాపారం చేస్తున్నప్పటికీ వెంట వెంటనే అవి అమ్ముడుపోతే అటు అప్పులు, బ్యాంకు రుణాలు తీరడంతో పాటు చేతిలో పది రూపాయలు కనిపించేవి. నెలల తరబడి ఫ్లాట్స్ బుక్ కాకపోవడం, తెచ్చిన అప్పులు, రుణాలపై వడ్డీ, ఈఎంఐలు పేరుకుపోతుండటంతోనే వేణుగోపాల్‌రెడ్డి ఆర్థిక ఇబ్బందుల్లో పడిపోయారని అక్కడి రియల్ వ్యాపారులు పేర్కొంటున్నారు.

బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంట్రల్‌లో నాలుగు రోజుల సీపీఆర్ శిక్షణను గురువారం నగర సీపీ సీవీ ఆనంద్ ప్రారంభించారు.సిటీ పోలీసులకు సీపీఆర్‌పై శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే మొదటి దశలో 1409 మంది సిబ్బందికి శిక్షణ ఇచ్చామని, తాజాగా మరో 1248 మంది సిటీ పోలీసు అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు సీపీ వెల్లడించారు.
-సిటీబ్యూరో

బీఆర్ఎస్ కార్పొరేటర్లపై పోలీసుల
దౌర్జన్యకాండ

బల్దియాలో బ్లాక్ డే

పాలకమండలి వేదికగా బీఆర్ఎస్ కార్పొరేటర్ల గొంతు నొక్కిన కాంగ్రెస్

జీహెచ్ఎంసీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సభ్యుల సస్పెండ్

ప్రజా సమస్యలపై ప్రశ్నించిన ప్రజాప్రతినిధుల అణిచివేత

సిటీబ్యూరో : పాలకమండలి వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల గొంతునొక్కింది. గురువారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన 10వ సర్వసభ్య సమావేశంలో వారిని సభ ఘోరంగా అవమానించింది. జీహెచ్ఎంసీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మెజార్టీ సభ్యులున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సస్పెండ్ చేసి.. మార్షల్స్‌తో బలవంతంగా సభ నుంచి బయటకు పంపించేశారు. ప్రజాస్వామ్య విరుద్ధంగా బడ్జెట్‌పై ఎలాంటి చర్చ జరగకుండానే ఆమోదిస్తున్నట్లు మేయర్ ప్రకటించి.. అన్ని పార్టీలను విస్మయానికి గురి చేశారు. ప్రజాస్వామ్య యుతంగా ప్రభుత్వ వైఖరిపై ప్రజాక్షేత్రంలో పోరాడుతున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లను అణగదొక్కే విధంగా సభ వ్యవహరించిన తీరుపై గ్రేటర్ వాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మేయర్ అధ్యక్షతన పాలక మండలి సమావేశం ఉదయం 10.35 గంటలకు ప్రారంభమైంది. 10.37 నిమిషాలకు దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, ప్రముఖ వ్యాపార దిగ్గజం రతన్ టాటా మృతికి సంతాపంగా రెండు నిమిషాల పాటు సభ మౌనం పాటించి నివాళులర్పించింది. అనంతరం ఆర్థిక సంవత్సరం (2025-26)కు సంబంధించిన రూ.8440 కోట్ల బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టి అన్ని పార్టీల సభ్యులకు చర్చకు అవకాశం కల్పించాలి. అయితే మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాత్రం చర్చ జరగకుండానే బడ్జెట్‌ను ఆమోదిస్తున్నట్లు ప్రకటించారు. అంతకు ముందు ఆరు గ్యారంటీలను అమలు చేయాలని, హైదరాబాద్ నగరానికి సరిపడా నిధులను వెంటనే మంజూరు చేయాలని ఫ్లకార్డులతో బీఆర్ఎస్ కార్పొరేటర్లు నిరసన తెలిపారు. దీంతో తొలుత నలుగురు కార్పొరేటర్లను జీహెచ్ఎంసీ అవతల ఉన్న వ్యాన్‌లో ఎక్కించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీరిని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ హాల్‌లో మిగతా కార్పొరేటర్లు నిరసన వ్యక్తం చేశారు. పోడియం వద్దకు వెళ్లిన బీఆర్ఎస్ కార్పొరేటర్ల చేతిలో ఉన్న ఫ్లకార్డులను కాంగ్రెస్ కార్పొరేటర్లు సీఎన్ రెడ్డి, బాబా ఫసియుద్దీన్లు లాక్కుని చించేశారు. కాంగ్రెస్ కార్పొరేటర్లు మహిళా కార్పొరేటర్లు అని చూడకుండా నెట్టేశారు. ఇదే అదనుగా సభ జరగకుండా అడ్డుకున్నారన్న కారణంతో మేయర్ ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ సెక్షన్ 89/1 ప్రకారం మార్షల్స్‌తో బీఆర్ఎస్ కార్పొరేటర్లను బయటకు తీసుకువెళ్లారు. కాగా, కౌన్సిల్ ప్రశ్నోత్తరాల సందర్భంగా అన్ని పార్టీల సభ్యులు సమస్యలపై ఏకరువు పెట్టారు. అధికార పార్టీ కార్పొరేటర్లే స్వయంగా ప్రజా సమస్యలు పెరిగిపోతున్నాయంటూ సభలో మేయర్ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుధ్య నిర్వహణ ఏ మాత్రం బాగులేదని, కోచ్‌లు లేక క్రీడారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని, వీధి దీపాలు లేక ప్రమాదాలు, దోపిడీలు పెరిగిపోయాయని, మురుగునీటి , నాలా సమస్యలతో ప్రజల్లోకి వెళ్లలేకపోతున్నామని స్వయంగా డిప్యూటీ మేయర్ మొదలుకొని కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, జగదీశ్వర్ గౌడ్ విమర్శించారు. కాగా, సర్వసభ్య సమావేశం సందర్భంగా జీహెచ్ఎంసీ కార్యాలయాన్ని పోలీసులు తమ గుప్పిట్లోకి తీసుకున్నారు. అంతేకాకుండా మార్షల్స్ బీఆర్ఎస్ కార్పొరేటర్లను హాల్ నుంచి బయటకు తీసుకువెళ్లే సమయంలో అత్యుత్సాహం ప్రదర్శించారు. మహిళా కార్పొరేటర్లు అని చూడకుండా వారిని బయటకు లాక్కుని వచ్చి వ్యాన్‌లోకి ఎక్కించారు.ఈ సందర్భంగా కొందరు మహిళా కార్పొరేటర్లకు స్వల్ప గాయాలయ్యాయి.



బల్దియా కౌన్సిల్ సమావేశంలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు

కొంగు లాగారు.. జుట్టు గుంజారు

మేయర్ సమక్షంలోనే మాపై కాంగ్రెస్‌వాళ్లు దాడి

జీహెచ్ఎంసీ మహిళా కార్పొరేటర్ల ఆవేదన

సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశానికి వెళ్లిన తమపై కాంగ్రెస్ పురుష కార్పొరేటర్లు బాబాఫసియుద్దీన్, సీఎన్‌రెడ్డి దాడి చేశారని, మహిళా కార్పొరేటర్లపై చేయి చేసుకోవడంతో పాటు జుట్టు పట్టుకుని లాగారని, చీరకొంగు పట్టుకుని గుంజారని బీఆర్ఎస్ కార్పొరేటర్లు మన్నె కవిత, హేమ సామల, రాసూరి సునీత, దేదీప్యరావు తదితరులు ఆరోపించారు. గురువారం తెలంగాణభవన్‌లో మీడియాతో వారు మాట్లాడుతూ కౌన్సిల్ మీటింగ్‌లో తమపై జరిగిన దాడి గురించి వివరించారు. నలుగురు బీఆర్ఎస్ మహిళా కార్పొరేటర్లపై దాడి చేసిన బాబా ఫసియుద్దీన్, సీఎన్‌రెడ్డిలు ఏ పార్టీ కండువాతో గెలిచారో మరిచిపోయారన్నారు.

బల్దియా చరిత్రలోనే తొలిసారి.. కార్పొరేటర్ మన్నె కవిత

తమ పార్టీకి చెందిన మహిళా కార్పొరేటర్లు నలుగురిపై అత్యంత దారుణంగా దాడి చేశారని, ఇలా చేయడం జీహెచ్ఎంసీ చరిత్రలోనే తొలిసారి అని బీఆర్ఎస్ కార్పొరేటర్ మన్నె కవిత అన్నారు. తోటి మహిళ అయిన మేయర్ తన తోటి మహిళలను గౌరవించలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నారని , బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లపై దాడి జరుగుతుంటే చూస్తూ ఊరుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మీడియాతో మాట్లాడుతున్న కార్పొరేటర్లు హేమ, దేదీప్యారావు, సునీత, కవిత

మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు వివేకానంద్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీ మహమూద్ అలీ

అవమానించారు: కార్పొరేటర్ సునీత రాసూరి

తమ సమస్యలు చెప్పుకోవడానికి వస్తే.. తాము తీసుకెళ్లిన పేపర్లను చించేశారని, మళ్లీ పేపర్లు తీసుకొని పొడియం దగ్గరకు వస్తే బయటకు పంపించారని కార్పొరేటర్ సునీత రాసూరి అన్నారు. దళిత మహిళ అని చూడకుండా తనను మేయర్ విజయలక్ష్మి అగౌరవపరిచారన్నారు.

దాడి చేశారు..: కార్పొరేటర్ దేదీప్యారావు

'బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి మా సంఖ్యతో గెలిచిన మేయర్ విజయలక్ష్మి చాలా దారుణంగా వ్యవహరిస్తున్నారు.. బడ్జెట్‌లో చాలా అవకతవకలున్నాయి.. మొదట ప్రశ్నల తర్వాత బడ్జెట్ పెట్టమని అడిగితే మాపై దాడి చేశారు' అని కార్పొరేటర్ దేదీప్యరావు అన్నారు.

భద్రత లేదు: కార్పొరేటర్ హేమ సామల

కౌన్సిల్‌లో మహిళలకు భద్రత లేకుండా పోయిందని, మేయర్ ముందు మహిళా బీఆర్ఎస్ కార్పొరేటర్లపై కాంగ్రెస్ పురుష కార్పొరేటర్లు దాడి చేస్తుంటే మేయర్ ఖండించకపోగా.. మార్షల్స్‌ను పిలిచి తమను అరెస్టు చేసి ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేశారని కార్పొరేటర్ సామల హేమ అన్నారు.

అరెస్టయిన కార్పొరేటర్లకు సంఘీభావం

బేగంపేట: జీహెచ్ఎంసీ బడ్జెట్ సమావేశంలో సమస్యలపై ప్రశ్నించిన బీఆర్ఎస్ కార్పొరేటర్లను అరెస్టు చేసి సికింద్రాబాద్ రాంగోపాల్‌పేటకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, కాలేరు వెంకటేశ్, వివేకానంద్ రాంగోపాల్‌పేట్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి అరెస్టయిన కార్పొరేటర్లకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న తమ కార్పొరేటర్లను బయటకు పంపి బడ్జెట్‌ను ఆమోదించడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. ఎలాంటి చర్చ జరగకుండా బడ్జెట్ ఆమోదించడం సరికాదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక అభివృద్ధి పనులు చేపట్టి హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చి ఏడాది దాటినా అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందన్నారు.

అధికారంలోకి వచ్చి 420 రోజులైనా..420 హామీలు అమలేవి..?

కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల ప్రశ్న..

గాంధీ విగ్రహాలకు వినతి పత్రాలు ఇచ్చి నిరసన



అల్వాల్ సర్కిల్‌లో గాంధీ విగ్రహానికి వినతిపత్రాన్ని సమర్పించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

ముషీరాబాద్ బాపూజీనగర్‌లోని గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

జీడిమెట్ల విలేజ్‌లోగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న చేస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు